



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్ సింగ్

వరి సాగుకే మొగ్గు

జిల్లాలో ఊపందుకున్న పొలం పనులు

- ఇప్పటికే 80,876 ఎకరాల్లో నాట్లు
- ఎస్సారెస్పీ జలాల విడుదలతో రైతులకు ఊరట
- నీటిని పొదుపుగా వాడుకోవాలంటున్న అధికారులు




మానుకోట శివారు గాంధీపురంలో డ్రమ్‌సీడర్ పద్ధతిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో తిరుపతిరెడ్డి



కేసముద్రం మండలం అన్నారం శివారులో వరి నాట్లు వేసిన దృశ్యం





కేసముద్రం మండలంలో ఎస్సారెస్పీ కాలువలో ప్రవహిస్తున్న నీరు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 27 : జిల్లాలోని రైతులు యాసంగిలో వరిపంట సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. శ్రీరాంసాగర్ లోయర్ మానేరు డ్యాంతో పాటు చెరువుల్లో నీటిమట్టం తగ్గడంతో వరిసాగు చేయొద్దని జిల్లా నీటి పారుదలశాఖ అధికారులు సూచించారు. బావులు, బోర్లకింద నీరు ఉన్నంతలోనే సాగు చేసుకోవాలని, ఆరుతడి పంటలు వేసుకుంటే మేలని చెబుతున్నారు. అయినా కర్షకులు మాత్రం వరిసాగు వైపే మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో వరినాట్లు మహబూబాబాద్ జిల్లాలో ఊపందుకుంటున్నాయి. కాగా, ఎస్సారెస్పీ జలాల విడుదలతో రైతులకు కొంత మేరకు ఊరట లభించింది. జిల్లాలో కూలీల కొరతను నివారించేందుకు డ్రమ్‌సీడర్ ద్వారా నేరుగా వరి విత్తుకునే విధానాన్ని రైతులు అవలంబిస్తున్నారు.

20 రోజుల క్రితమే నాట్లు ప్రారంభం..

మహబూబాబాద్ జిల్లాలో వరి 1,08,177 ఎకరాల్లో సాధారణ విస్తీర్ణం కాగా, ఇప్పటి వరకు బావులు, బోర్లు, చెరువుల కింద 80,876 ఎకరాల్లో వరినాట్లు చేశారు. అత్యధికంగా నెల్లికుదురు, పెద్దవంగర, తొర్రూరు, కేసముద్రం, మరిపెడ మండలాల్లో సాగు చేస్తున్నారు. గత 20 రోజుల క్రితమే వరినాట్లు ప్రారంభమయ్యాయి. చాలా గ్రామాల్లో నాట్లు వేయడానికి ఇంకా దుక్కులుదున్నుతున్న, నాట్లు వేస్తున్న దృశ్యాలు కన్పిస్తు న్నాయి. మహబూబాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు ఇతర పంటలు వేశారు. మొక్కజొన్న 41,622, మినుములు 401, వేరుశనగ 1,778, పచ్చజొన్న 1,197, నువ్వులు 37, ఇతర పంటలు 3,711, కూరగాయలు 391 ఎకరాల్లో సాగు చేశారు.

ఎస్సారెస్పీ జలాలు విడుదల..

ఈ యాసంగిలో నీటి పారుదలశాఖ ఈనెల 1వ తేదీ నుంచి ఎస్సా రెస్పీ జలాలను విడుదల చేస్తున్నారు. మార్చి 31 వరకు నీటి విడుదల కొనసాగుతోంది. జిల్లాలోని డీబీఎం-48, డీబీఎం-60 ప్రధాన కాలువల కిందఉన్న ఉపకాలువల ద్వారా వారం విడిచి, వారం పద్ధతిలో నీరు విడుదల చేస్తున్నారు. లోయర్ మానేరు డ్యాంనుంచి ప్రతీరోజు 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తే మహబూబాబాద్ జిల్లాకు అందులో 600 నుంచి 800 క్యూసెక్కుల వరకు నీరు వస్తున్నట్లు జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. స్టేజీ-1 కాలువ కింద ఇనుగుర్తి, కేసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్, ఇతర ప్రాంతాలకు, స్టేజీ-2 ద్వారా తొర్రూరు, దంతాలపల్లి, మరిపెడ మండలాల కాలువల ద్వారానీరు విడుదలవుతోంది. నీటిని పొదుపుగా వాడుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులు సూచిస్తున్నారు.

డ్రమ్‌సీడర్ ద్వారా వరిసాగు..

మహబూబాబాద్ జిల్లాలో పలు మండలాల్లో డ్రమ్‌సీడర్ ద్వారా నేరుగా విత్తే పద్ధతి వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. కూలీల కొరత ను అధిగమించడానికి నారుపెంచి, నాట్లువేసే పద్ధతి ద్వారా సాగు ఆలస్యమవుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. దీంతో డ్రమ్ సీడర్ పద్ధతితో నేరుగా వరి విత్తనాలు విత్తితే అధిక దిగుబడి వస్తుందని వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల గాంధీపురం గ్రామంలో మండల వ్యవసాయాధికారి తిరుపతిరెడ్డి ఈ పద్ధతిని రైతులకు క్షేత్ర ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించడంతో ఆ గ్రామరైతులు అత్యధికంగా ఈ పద్ధతిని అవలంబిస్తోండడం గమనార్హం.

నీటిని పొదుపుగా వాడుకోవాలి..

- సమ్మిరెడ్డి, నీటిపారుదల శాఖ ఈఈ

శ్రీరాంసాగర్ లోయర్ మానేరు డ్యాంలో ఇతర రిజర్వాయర్లలో తగినంత నీటి లభ్యత లేదు. కాలు వల చివరి ఆయకట్టుకు సరిపడ సాగునీటిని అందించలేం. బోరు సదుపాయం, బావుల్లో నీరుఉన్న వాటికే వరి సాగు చేసుకోవాలి. కాలువ నీటి మీద ఆధారపడకుండా ఆరుతడి పంటలు వేసుకోవాలి. కాలువ ల్లోకి నీరు వచ్చిన సమయంలో నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలి.



ఈనెల 31లోగా నాట్లు వేసుకోవాలి..

- నెలకుర్తి రవీందర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, నెల్లికుదురు

యాసంగిలో ఈనెల 31వ తేదీలోగా నాట్లు పూర్తి చేసుకోవాలి. అలా అయితే ఏప్రిల్ 15 వరకే పంట కోతకు వస్తుంది. ఆలస్యమైతే ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా వడగండ్ల వానలు వచ్చి, వరి రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ఉష్ణోగ్రతలు పెరగడంతో గింజలు గట్టిపడకుండా తాలుగా వచ్చే అవకాశం ఉంది. రైతులు గమనించి వరినాట్లు పూర్తి చేసుకోవాలి.

ఇంటర్ పరీక్షలను పక్కాగా నిర్వహించాలి

- వచ్చేనెల 1వ తేదీ నుంచి ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్
- సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు
- జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్, జనవరి27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్ పరీక్షలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థుల కోసం 19 థియరీ, 46ప్రాక్టికల్ పరీక్షకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 9,546 మంది జనరల్ కాగా, 8,541 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరవుతున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్రారంభమై 15 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్‌థియరీ పరీక్షలు ఫిబ్రవరి 28వ తేదీ నుంచి మార్చి 14 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. ఆర్టీసీ అధికారులు బస్సులను పరీక్షలకు గంట ముందుగా విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకునేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ నిరంతరం కరెంట్ సరఫరా అయ్యేలా చూడాలని, పంచాయతీ, మునిసిపల్‌శాఖ అధికారులు శానిటేషన్ చేపట్టి తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. వైద్యశాఖాధికారులు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు, యాంటీబయాటిక్ మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పోలీస్‌శాఖ బందోబస్తు చేపట్టాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు ఆకస్మికంగా పర్యవేక్షించాలన్నారు. పోలీస్‌శాఖ పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రతా సిబ్బందితో ప్రశ్నాపత్రాలు పరీక్షకు అరగంట ముందు కేంద్రాలకు అందించడం, జవాబు పత్రాలు ప్యాకింగ్ పటిష్టంగా చేపట్టి, పోస్టల్‌శాఖకు అందజేయాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్నాపత్రాల ప్యాకింగ్ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు, మానుకోట డీఎస్పీ సత్యనారాయణ, ఇంటర్ అధికారి సత్యనారాయణ, డీఈవో రామారావు, విద్యుత్‌శాఖ అధికారి నరేష్, డీఎఅండ్‌హెచ్‌వో అంబరీష, డీవిజనల్ పంచాయతీ అధికారి గంగాభవానీ, ఆర్టీసీ డీఎం శివప్రసాద్, మునిసిపల్ కమిషనర్ ప్రసన్నారాణి, విజయకుమారి, ఇన్‌చార్జి టౌన్ సీఐ రమేష్ పాల్గొన్నారు.

ఇస్లావత్‌తండా (ఎం) సర్పంచ్ సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

మహబూబాబాద్ రూరల్, జనవరి 27 : మహబూబాబాద్ మండలం ఇస్లావత్ తండా (ఎం) సర్పంచ్ ఇస్లావత్ నరేష్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఉత్తర్వులను జారీ చేశారు. సర్పంచ్ నరేష్ గ్రామపంచాయతీ నిధుల నుంచి 16నవంబర్ 2023న గ్రామ ఉప సర్పంచ్ రంగమ్మ సంతకాన్ని ఫోర్జరీ చేసి, మహబూబాబాద్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి రూ.49 వేలను డ్రా చేసుకున్నారు. ఈ విషయంపై డిసెంబర్ 24న ఉపసర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్పంచ్‌పై విచారణకు పంచాయతీ అధికారులను ఆదేశించారు. విచారణ చేపట్టగా సర్పంచ్ ఉప సర్పంచ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి రూ.49 వేలు డ్రాచేసుకున్నట్లు రుజువు అయినందున, సదరు నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. పంచాయతీ అధికారుల నివేదిక ఆధారంగా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంప్రకారం 2018 సెక్షన్ 37-1 (ii), (iii), (iv)-37(5) ప్రకారం.. నరేష్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి ఓపెన్ డిగ్రీ తరగతుల ప్రారంభం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 27 : జిల్లా కేంద్రంలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెంటర్‌లో ఆదివారం (నేటి) ప్రత్యక్ష తరగతులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ రాజు, సెంటర్ కన్వీనర్ సీహెచ్.మల్లేషం శనివారం తెలిపారు. బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సర మొదటి సెమిస్టర్ విద్యార్థులకు ఈ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఈనెల 28 నుంచి ప్రతీ ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు ప్రత్యక్ష తరగతులు జరుగుతాయన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థులు తరగతులకు హాజరుకావాలని వారు సూచించారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 7382929705ను సంప్రదించాలన్నారు.

ఎస్సెస్సీ పరీక్ష ఫీజు గడువు పెంపు

- జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 27 : జిల్లాలోని పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఫీజు గడువును అదనపు రుసుంతో ఫిబ్రవరి 5వరకు చెల్లించవచ్చునని డీఈవో రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చిలో జరుగనున్న ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షలకు ఫీజుచెల్లించని విద్యార్థులు ఉంటే తత్కాల్ స్కీం కింద రూ.1000 అపరాధ రుసుంతో చెల్లించే అవకాశం ఉందన్నారు. ఇతర వివరాలకు ఏసీజీఈ శ్రీరాములు సెల్ :98497 61012 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

రాత్రి 9 గంటల తర్వాతే మిర్చిని యార్డుకు తీసుకురావాలి

- మానుకోట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి శంషీర్

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 27 : రోజూ రాత్రి 9 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6గంటల్లోపు మాత్రమే మిర్చిని మార్కెట్‌లోకి అనుమతించబడుతుందని మాను కోట మార్కెట్ కార్యదర్శి శంషీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ సిబ్బంది కేటాయించిన షెడ్లలో మాత్రమే బస్తాలను వరుస క్రమంలో పెట్టుకోవాలని, రైతులు మిర్చి తెచ్చినప్పటి నుంచి కాంటాలు పూర్తయ్యేంత వరకు సరుకు వద్దనే ఉండాలన్నారు. మార్కెట్‌లో సరిపడ స్థలం లేకపోవడం వల్ల కాంటాలు ఆలస్యమవుతున్నాయని, రోజూ 500 లాట్ ఐడీలు రైతులకు మంజూరు చేస్తామని వివరించారు. లాట్ ఐడీ ఇచ్చిన రైతుల సరుకు మాత్రమే వ్యాపారులు ఖరీదులు చేస్తారని, అవిలేని రైతుల సరుకులు ఖరీదు చేయరని తెలిపారు. మిర్చిని పూర్తిగా ఎండబెట్టి, నాణ్యమైన మిర్చిని తీసుకువస్తే మంచిధర పలుకుతుందని, మార్కెట్‌కు ప్రతీ శని, ఆదివారం, ఆమావాస్యరోజు మార్కెట్ యార్డుబంద్ ఉంటుందని, రైతులు గమనించి సహకరించాలని శంషీర్ కోరారు.

మేడారం వస్తున్నా..

- 23న జాతరకు వచ్చి వనదేవతలను దర్శించుకుంటా..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రాష్ట్ర సచివాలయంలో మహాజాతర పోస్టర్ ఆవిష్కరణ
- సీఎంను సన్మానించిన పూజారులు
- సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం సమర్పన
- మేడారాన్ని డిప్యూటీ కమిషనర్ పరిధికి అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి



సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న మేడారం పూజారులు

ములుగు, జనవరి 27: మేడారం వనదేవతల మహాజాతరకు హాజరవుతానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఫిబ్రవరి 23న మేడారం వచ్చి సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుంటానని తెలిపారు. వనదేవతల వడ్డెలు (పూజారులు) సిద్ధబోయిన జగ్గారావు, కాక సారయ్య, కాక కిరణ్, చంద రఘుపతిరావు సీఎంను శనివారం కలిశారు. రాష్ట్ర పంచాయ తీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్కతో కలిసి రాష్ట్ర సచివాలయంలో భేటీ అయ్యారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, దేవాదాయ, గిరిజన సంక్షేమ శాఖ అధికారుల సమక్షంలో జాతర పోస్టర్‌ను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన్ను పూజారులు శాలువాతో సన్మానించారు. వనదేవతల పసుపు కుంకుమ, ప్రసాదాన్ని అందజేశారు. జాతరకు రావాలని ఆహ్వానించారు. ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు జాతర జరుగుతుండగా వనదేవతలంతా గద్దెలపై కొలువున్న 23న మొక్కుల రోజున మేడారం వచ్చి దర్శనం చేసుకుంటానని రేవంత్‌రెడ్డి వారికి తెలిపారు.

వారసత్వ వాటా సమస్యను తీర్చాలి..

మేడారం వడ్డెలు (పూజారుల) సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి పూజారులు వినతి పత్రం సమర్పించారు. అందులో పలు అంశాలను పేర్కొన్నారు. ప్రధానంగా వారసత్వ వాటా విషయంలో న్యాయ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పులు, హిందూ వారసత్వ చట్టాన్ని అనుసరించి పూజారుల కొడుకులకే వారసత్వ వాటా చెందేలా ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. పాలనా పరంగా మేడారం జాతర ప్రస్తుతం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పరిధిలో ఉందని, డిప్యూటీ కమిషనర్ స్థాయికి అప్‌గ్రేడ్ చేసి జాతర ప్రాంగణంలో శాశ్వత ఈవో కార్యాలయాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

ధార్మిక భవానికి సమ్మక్క సారలమ్మ పేరు పెట్టాలి

వరంగల్‌లో గతంలో పూజారులకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూమిలో రూ.కోటి మేడారం వాటా ధనంతో నిర్మించిన ధార్మిక భవనానికి సమ్మక్క, సారలమ్మల పేరు పెట్టాలని సీఎంను పూజారులు కోరారు. భవనాన్ని మేడారం పరిధిలో ఉంచుతూ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. పూజారులకు హెల్త్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. డోలీలనుదేవాదాయశాఖ ఆధ్వర్యంలో నియమించాలని కోరారు.

వనదేవతలకు మొక్కులు





మేడారంలో భక్తుల దర్శనాలు, గద్దెల ప్రాంగణంలో పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠీ

మేడారం, జనవరి 27: సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు మహాజాతర జరుగనున్న నేపథ్యంలో ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చారు. ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించి, కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించారు. అనంతరం గద్దెలకు చేరుకుని మొక్కులు చెల్లించారు. సుమారు 30 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

విరాళం ఇచ్చిన వ్యాపారి

మేడారం మహాజాతరకు ఓ వ్యాపారి విరాళం ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన రాడికో లిక్కర్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్ చంద్రారెడ్డి రూ.లక్ష 800 ఈవో రాజేంద్రం అందజేశారు.

పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్

మహాజాతరలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనుల పరోగతిని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. జాతర సమీపిస్తున్న నేపథ్యంలో నెల చివరికల్లా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హరిత హోటల్ పరిసర ప్రాంగణం, క్యూలైన్లు, వీధిదీపాల ఏర్పాట్ల పనులను పరిశీలించారు. ఆయాపనుల నిర్వహణకు జోనల్ వారీగా బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆమె వెంట ఈవో రాజేంద్రం, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, డీపీవో వెంకయ్య, తహసీల్దార్ రవీందర్, పలు శాఖల అధికారులు ఉన్నారు.

భూ ఆక్రమణకు యత్నిస్తున్న వారిపై చర్య తీసుకోవాలి

- సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 27 : బ్యాంక్ కాలనీలోని సర్వేనెంబర్ 538, 539లతో సుమారు 528 గజాల స్థలాన్ని ప్రజావసరాల కోసం పూర్వ మానుకోట జీపీ కార్యదర్శి పేరిట మునిసిపాలిటీకి రిజిస్ట్రేషన్ అయిన రూ.కోటి విలువ భూమిని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి ఆరోపించారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయం ఎదుట శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనచేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ కాలనీలోని మునిసిపాలిటీ స్థలాన్ని అభివృద్ధి చేయాలని దశాబ్ద కాలంగాస్థానికులతో కలిసి పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. ఆరునెలల క్రితం మునిసిపల్ అధికారులు బహిరంగ విచారణ చేపట్టినప్పటికి ఇప్పటికి పరిష్కారం చూపకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి కొంతమంది భూఆక్రమణకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ ప్రసన్నారాణికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నీరజ, బ్యాంక్ కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పుప్పాల సంజీవరావు, బండి నరేందర్‌రెడ్డి, సంకెపల్లి రాంమోహన్‌రెడ్డి, పెరుగుకుమార్, రాజేశ్వర్ రావు, శ్రీధర్, శ్యామ్, విద్యాసాగర్, అంజయ్య, మెతుకు కుమార్, రమేష్, పాండురంగాచారి, రవి, మంద శంకర్ పాల్గొన్నారు.

నర్సింగ్ శిక్షణకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

హనుమకొండ రూరల్, జనవరి 27: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ఉపాధి శిక్షణ కింద జపాన్‌లో నర్సింగ్ సిబ్బంది శిక్షణ, నియామకం కోసం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోందని 22 నుంచి 30 యేళ్ల వయస్సుగల బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం, డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు హైదరాబాద్ విద్యానగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్ ట్రెయినింగ్ సెంటర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 8919047600, 9573945684, 6302292450 లలో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా ప్రొఫెసర్ వెంకయ్య



కేయూ క్యాంపస్, జనవరి 27: కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా కేయూ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. వెంకయ్య గతంలో జంతుశాస్త్ర విభాగాధిపతిగా, బీవోఎస్ బోర్డు ఆఫ్ చైర్మన్‌గా, కేయూ క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా, అడ్మిషన్ల డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. కేయూ హాస్టల్స్ డైరెక్టర్‌గా పనిచేశారు.

ఆటోను ఢీకొట్టిన లారీ - నలుగురికి గాయాలు


ప్రమాదంలో క్షతగాత్రులు

కురవి, జనవరి 27 : కురవి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆటోను లారీఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం. మాధవాపురం గ్రామానికి అరూరి వెంకన్న తన కుటుంబసభ్యులతో కలిసి ఆటోలో మహబూబాబాద్‌లో ఓ శుభకార్యంకు వెళ్తున్నారు. ఆటో కురవి వద్దకు చేరుకోగానే మహబూబాబాద్ నుంచి మరిపెడ వైపు వెళ్తున్న లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్నారి బాబు అరవింద్‌కు తీవ్రగాయాలయ్యాయి. మరో చిన్నారి భానుతేజకు చేయి విరిగింది. అరూరి ఉపేంద్ర, అరూరి వెంకన్న, అనిల్‌లకు గాయాలయ్యాయి. ఎస్సై గోపి ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కస్నాతండాలో నల్లబెల్లం పట్టివేత

డోర్నకల్, జనవరి 27 : మండలంలోని కస్నాతండా వద్ద శనివారం నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లంతో పాటు 50 కిలోల పటికను పట్టుకున్నట్లు ఎస్సై ఝాన్సీ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కస్నాతండా క్రాస్‌రోడ్డు వద్ద సమ్మక్క-సారలమ్మ గద్దెల సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ నెంబర్‌ప్లేట్ లేని ఆటోను గుర్తించినట్లు చెప్పారు. దానిని తనిఖీ చేయగా అందులో నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటికను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రవాణాకు ఉపయోగించిన ఆటోను సీజ్‌చేసి, ఇందుకు బాధ్యులైన బోరింగ్‌తండాకు చెందిన మోహన్, నాగేష్‌ను అదుపులోకి తీసుకోగా, కురవి మండలం లింగ్యాతండాకు చెందిన వెంకటేష్ పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

యువతిని మోసగించిన యువకుడిపై కేసు నమోదు

కొత్తగూడ, జనవరి 27: పెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు ధర్నా చేసిన ఘటన కొత్తగూడ మండలంలో శనివారం జరిగింది. యువతి (28)ని మోసగించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామంలో యువతిని అదే గ్రామానికి చెందిన యువకుడు జల్లెల ప్రశాంత్ పెళ్లి చేసుకుంటానని మూడేళ్లుగా ప్రేమించాడు. కాగా, ఆ యువతిని వివాహం చేసుకోవడానికి యువకుడు నిరాకరించాడు. దీంతో ప్రశాంత్ ఇంటి ఎదుట ఆ యువతి శనివారం బైఠాయించింది. పెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేసింది. కాగా, పోలీస్‌స్టేషన్‌లో ప్రశాంత్‌పై యువతి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్టు ఎస్సై నగేష్ తెలిపారు.

మరో ఐదేళ్లు ఉచిత బియ్యం

● ఈ నెల నుంచి ఉచిత పంపిణీ కొనసాగింపు ● ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9.57 లక్షల మందికి లబ్ధి



హనుమకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద రేషన్‌కార్డుదారులకు ఉచిత రేషన్ బియ్యం పంపిణీ కొనసాగింపు మళ్లీ ఈనెల నుంచి మొదలు కానున్నది. వచ్చే ఐదేళ్లవరకు ఇది కొనసాగుతుంది. ఉచిత బియ్యం పంపిణీకి అవసరమైన బియ్యంకోటా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చేరింది. పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉచిత బియ్యం పంపిణీని కేంద్ర ప్రభుత్వం మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో నిరుపేదలు, అట్టడుగువర్గాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉచిత బియ్యం పంపిణీ ఈనెల నుంచి మళ్లీ అమలులోకి తీసుకువస్తూ గత ఉత్తర్వులు జారీ చేసింది. కొవిడ్-19 మహమ్మారి వ్యాప్తి సమయంలో పీఎంజీకేవై పథకాన్ని 2020 మార్చిలో కేంద్రం ప్రారంభించింది. కరోనా లాక్‌డౌన్ తర్వాత పేదలను ఆదుకోవడం కోసం, వారి జీవనోపాధికి ఆసరగా నిలిచేందుకు ఈ పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది.

పలుమార్లు పొడిగింపు

ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ (పీఎంజీకేఏవై) ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా మొదటి, రెండో దశల కింద ఉచిత బియ్యం పంపిణీని 2020 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు అమలు చేశారు. ఆతర్వాత మూడో దశను మే నుంచి 2021 జూన్ వరకు పొడిగించారు. నాలుగోదశను 2021 జూలై నుంచి 2021 నవంబర్ వరకు, ఐదోదశను 2022 మార్చి వరకు, ఆరో దశను 2022 డిసెంబర్ వరకు, ఏడో దశను గత 2023 డిసెంబర్ వరకు కొనసాగించారు. ఇప్పుడు తాజాగా 2024 జనవరి మరో ఐదేళ్లపాటు కొనసాగిస్తారు. ఈ పథకానికి అయ్యే ఖర్చును రాష్ట్రాలతో సంబంధం లేకుండా కేంద్రమే భరిస్తోంది. 2022 డిసెంబరు 31న ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన (పీఎంజీకెవై)ని జాతీయ ఆహార భద్రతాచట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ)లో కేంద్రం విలీనం చేసింది. దీంతో అప్పటినుంచి ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు) ఉన్న లబ్దిదారులందరికీ ఉచిత రేషన్ బియ్యం పథకాన్ని కొనసాగిస్తోంది.

9.57 లక్షల మందికి లబ్ధి

వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 9,57446మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. కేంద్ర నిర్ణయంతో ఆయా కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నది. ఆహార భద్రత కార్డుదారులకు యూనిట్‌కు 6కిలోల చొప్పున, అంత్యోదయ కార్డుదారులకు 35కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్డుదారులకు జనవరి నెలలో 19,290.47 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించారు. ఈబియ్యాన్ని ఈనెలలో పంపిణీ చేస్తారు.

అన్ని రేషన్ కార్డులకు..

అన్నపూర్ణ, అంత్య యోజన కార్డుదారులు, ఆహార భద్రతాకార్డు కలిగిన కుటుంబాలకు అన్ని రేషన్‌షాపులలో ఉచితంగా అందిస్తారు. కొవిడ్ మహమ్మారి సమయంలో విధించిన అదనపు నిబంధనలను కూడా తొలగించారు. కేంద్ర ప్రభుత్వం కొవిడ్‌కంటే ముందు రేషన్‌కార్డు ఉన్న వారికి కిలో బియ్యాన్ని సబ్సిడీ ధరతో రూ.1-3 వరకు అందించేది. ఐదు కిలోల చొప్పున ఒక్కొక్కరికి కేటాయించేది. అలాగే అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కుటుంబాలకు 35 కిలోల బియ్యాన్ని పంపిణీ చేసేది. అయితే ఈ స్కీమ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి కేంద్రం ఒక్క పైసా కూడా తీసుకోకుండా పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తోంది.

ఉచిత బియ్యం పక్కదారి

ఈ ఉచిత బియ్యాన్ని రెండేళ్లుగా కార్డుదారులు అందరూ తీసుకోవడం లేదు. 70 నుంచి 80 శాతం కార్డుదారులు మాత్రమే ప్రతీ నెల తీసుకుంటున్నారు. మిగిలిన 20 నుంచి 30 శాతం కార్డుదారులు తమ కార్డులు రద్దుకాకుండా ఉండేందుకు రెండు నెలలకోసారి తీసుకుంటున్నారు. పదిశాతం మంది కార్డుదారులు ఈ ఉచిత బియ్యాన్ని కిలో ఒక్కంటికి రూ.8 నుంచి రూ.10లకు రేషన్‌షాపు డీలర్లకే విక్రయిస్తున్నారు. మిగిలిన 20శాతం కుటుంబాలు కిరాణం, ఇడ్లీ బండ్లు, చిరువ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

బెల్టుషాపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు


పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

హనుమకొండ క్రైం, జనవరి 27: సుబేదారి పీఎస్ పరిధిలోని వడ్డెపల్లిలో అక్రమంగా విక్రయిస్తున్న బెల్టుషాపుపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడులు చేశారు. ఈ దాడులలో రూ.74వేల విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డెపల్లిలోని పెసరు రాజ్‌కుమార్ అనే వ్యక్తి కొద్దిరోజులుగా ఇంటినే అడ్డాగా చేసుకుని బెల్టుషాపు నడిపిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో శనివారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేసి రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని ఇంట్లో డంప్ చేసిన వివిధ బ్రాండ్లకు సంబంధించిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పట్టుకున్న మద్యాన్ని సుబేదారి పోలీసులకు అప్పగించారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీతారాంనాయక్ తదితరులు

జర్నలిస్టులు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

మాజీ ఎంపీ సీతారాంనాయక్

వడ్డెపల్లి, జనవరి 27: సామాజిక స్పృహ కలిగిన జర్నలిస్టులు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ప్రముఖ బంజారా నేత, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ నిర్వహించిన సమావేశంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించినన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బానోతు వెంకన్న, జిల్లా అధ్యక్షుడు గుగులోతు హుస్సేన్ నాయక్, కార్యదర్శి దేవేందర్ నాయక్, జర్నలిస్టులు అంతడుపుల శ్రీనివాస్, రోజనాల శ్రీనివాస్, శోభన్‌బాబు, మాడ నర్సయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం


విద్యుదాఘాతంతో దగ్ధమైన ఇల్లు

పరకాల, జనవరి 27: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన సంఘటన పరకాల పట్టణంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పరకాల పట్టణానికి చెందిన నేరెళ్ల పరశురాంకు చెందిన ఇంట్లో ఫ్రిడ్జి ప్లగ్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో పెద్ద ఎత్తున మంటలు లేచాయి. ఇది గమనించిన చుట్టూపక్కల ప్రజలు స్థానిక ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది వెంటనే చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటి వరకే ఇంట్లో ఉన్న ఫ్రిడ్జితోపాటు ఇంటి పైకప్పు, ఇంట్లోని సమాన్లతోపాటు డబ్బులు మంటల్లో కాలిపోగా, రూ. 2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు పేర్కొన్నారు.

శివనగర్‌లో భారీ చోరీ

15 తులాల బంగారం, 25 తులాల వెండి, 45వేల నగదు అపహరణ

ఖిలావరంగల్, జనవరి 27: వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతం శివనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో శుక్రవారం రాత్రి భారీ చోరీ జరిగింది. శనివారం ఉదయం ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం. వరంగల్ రైల్వే స్టేషన్ శివనగర్ ఎదురుగా ఉన్న ఇంట్లో వ్యాపారం (వాటర్ బాటిల్ అమ్మకం) పూజారి రవి-శ్రీలత దంపతులు ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులుండగా, వారు హైదరాబాద్‌లో ఉంటున్నారు. రవికి అనారోగ్యం కారణంగా దంపతులు మూడు రోజుల క్రితం వైద్యపరీక్షల నిమిత్తం రాజస్థాన్‌కు వెళ్లారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి 15తులాల బంగారం, 25తులాల వెండి, 45వేల నగదు అపహరించారు. బంగారం, వెండి, నగదు కలిపి సుమారు కోటి రూపాయల దొంగతనం జరిగినట్లు తెలిపారు. శనివారం ఉదయం రవి తమ్ముడి భార్య ఇంట్లోని చెట్లకు నీళ్ల పట్టే క్రమంలో ఇంటికి వేసిన తాళాన్ని పగలకొట్టి ఉండడం చూసి, మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారమిచ్చింది. పూజారి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం విషయాన్ని పోలీసులు రవి కుటుంబానికి సమాచారమిచ్చారు. వారి చెప్పిన దాని ప్రకారం చోరీ అంచనా వేశారు. కేసును సీఐ సురేష్ దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

పర్వతగిరి, జనవరి 27 : మండలంలోని దౌలత్‌నగర్‌లో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి.వీరన్న, ఆర్గనైజర్ పిండి కొమురయ్యలు క్రీడలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సర్వర్, సర్పంచ్ కొల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మొదటి రోజు 13 జట్లు పాల్గొన్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు బండి వెంకటేశ్వర్లు, పిండి మల్లికార్జున్, కత్తుల శ్రీనివాస్, నల్గొండ సూర్యప్రకాష్, ఎస్సెమ్సీ చైర్మన్ బొమ్మెర సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు విశ్వ విజేతలుగా ఎదగాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

ఘనంగా ఏకశిల పాఠశాలల వార్షిక వేడుకలు

హసన్‌పర్తి, జనవరి 27: విద్యార్థులు విశ్వ విజేతలుగా ఎదగాలని, మారుతున్న పోటీ ప్రపంచంలో తమ గమ్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా కోరారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి వద్ద గల ఏకశిలా టెక్నో స్కూల్‌లో శనివారం ఏకశిలా పాఠశాలల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఏ రంగంలోనైనా గొప్ప వక్తలుగా తయారవుతారన్నారు. ఉన్నత స్థానానికి చేరి నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగినప్పుడే కీర్తించబడుతారన్నారు.

అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.డి. అబ్దుల్‌హై మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో తరగతి గది పాత్ర ప్రధానమైనదన్నారు. విద్యార్థులను సక్రమమైన పద్ధతిలో, క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఏకశిలా విద్యా సంస్థల ద్వారా విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతిలో 10/10 జీపీఏ, సీబీఎస్ఈలో 485 మార్కులు సాధించిన విద్యార్థులకు ఏకశిలా జూనియర్ కళాశాలలో ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏకశిలా విద్యాసంస్థల డైరెక్టర్లు గౌరు సువిజారెడ్డి, బేతి కొండల్ రెడ్డి, ముచ్చ జితేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సీహెచ్ దినేష్‌రెడ్డి, బేతి శైలజ, స్వప్నరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు


ఆత్మకూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వినియోగదారుల మండలి ప్రతినిధులు

పెద్దాపురంలో అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోండి..

ఆత్మకూరు తహసీల్దార్‌కు వినియోగదారుల మండలి ఫిర్యాదు

హనుమకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపురం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ జరుగుతోందని వియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి, సంయుక్త కార్యదర్శి నల్లా రాజేందర్ శనివారం ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి కలిసి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ శాఖ నుంచి ఎన్‌వోసీ (నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్)లు లేకుండా మైనింగ్ సంస్థలు బ్లాక్‌గ్రానైట్‌ను తీస్తున్నాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. పెద్దాపురం మైనింగ్ సంబంధించి ఎన్‌వోసీలు దొరకడం లేదని అధికారులు చెబుతున్నారని తెలిపారు. సర్వే నెంబరు 584/1లో రెండు మైనింగ్ సంస్థలు మైనింగ్ శాఖ చేసుకున్న అగ్రిమెంట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, ఇప్పటికీ రెండు సంస్థలు పర్యావరణ నిబంధనలు అతిక్రమించిందువల్ల న్యాయస్థానాలు జరిమానా విధించాయని, లోకాయుక్తలో విచారణ జరుగుతున్నదని తెలిపారు. అయినా కూడా నిబంధనల ప్రకారం మైనింగ్ నిర్వహించకపోవడంపై రెవెన్యూశాఖ ఇకనైనా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సర్వే నెంబరు 584/లో 2008 నుంచి మైనింగ్ జరుగుతున్న క్రమంలో అక్కడ ఉన్న గుట్ట అతి పెద్ద బిలంగా మారిపోయి స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. అనంతరం ధరణి పోర్టల్‌కు సంబంధించిన ఫిర్యాదులను తహసీల్దార్‌కు ఇచ్చారు.

వైద్యం కోసం సాయం చేయండి..


మాట్లాడుతున్న నాగరాజు, మౌనిక

వడ్డెపల్లి, జనవరి 27: తమ కుమారుడి వైద్యం కోసం సహాయం చేయాలని ములుగు జిల్లా చల్వాయి గ్రామానికి చెందిన నాగరాజు, మౌనిక దంపతులు వేడుకుంటున్నారు. ఈ మేరకు హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. త కుమారుడు లక్ష్మణ్ ఇటీవల ఆడుకుంటూ కిందపడడంతో తలకు తీవ్ర గాయాలై ఫిట్స్ రావడం ప్రారంభం అయ్యాయి. తల్లిదండ్రులు వెంటనే హనుమకొండలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. లక్ష్మణ్‌కు వెంటిలేటర్‌పై వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రోజుకు రూ.55 నుంచి 60వేల వరకు ఖర్చు అవుతోందని చెప్పారు. ప్రయివేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తాము కుమారుడి వైద్య ఖర్చులు భరించే స్థోమత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు ముందుకొచ్చి తమ కుమారుడికి ప్రాణబిక్ష పెట్టేందుకు ఆర్థిక సహకారం అందించాలని నాగరాజు, మౌనిక వేడుకుంటున్నారు. ఫోన్‌పే నంబర్ 8008994920కు ఆర్థికసాయం పంపించాలని వారు కోరారు.

టీఎస్ ఏటీఎఫ్ సంఘం బలోపేతానికి కృషి చేయాలి

● జిల్లా అధ్యక్షుడు భిక్షం

గూడూరు, జనవరి27 : తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్ ఏటీఎఫ్) సంఘం బలోపేతంకు కృషి చేయాలని, మండలాల్లో నూతన కమిటీలు ఎన్నుకోవాలని టీఎస్ ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిద్ధబోయిన భిక్షం పిలుపునిచ్చారు. గూడూరు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం టీఎస్ ఏటీఎఫ్ సంఘం సమావేశం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం కల్తి పాపయ్య చేతుల మీదుగా టీఎస్ ఏటీఎఫ్ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కల్తి భాస్కర్‌రావు, ఉపాధ్యక్షుడు మాడే రామకృష్ణ, ప్రచార కార్యదర్శి చుంచు రవీందర్‌రావు, కార్యదర్శులు ఛైపతి గణేష్, కల్తి రామకృష్ణ, గట్టి సమ్మయ్య, కోటెం సీతారాములు, బయ్యారం, గార్ల, గంగారం మండలాల అధ్యక్షులు గీతంపల్లి కృష్ణ, కబ్బాకుల వెంకన్న, చుంచ మహేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే పేదలకు సంక్షేమ ఫలాలు

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు రూరల్, జనవరి 27 : నిరుపేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సంక్షేమ ఫలాలు సాధ్యమైన మేరకు అందుతాయని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఫత్తేపురం, మడిపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్‌పై ఎంతో నమ్మకంతో గెలిపించిన ప్రతీ ఒక్కరికి అండగా ఉంటూ, గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని అన్నారు. అనంతరం గ్రామాల సర్పంచ్‌లను, పంచాయతీ కార్యదర్శులతో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో పీఏసీఎస్ ఛైర్మన్ కాకిరాల హరిప్రసాద్, ఎంపీపీ తూర్పాటి చిన్నఅంజయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఇట్టె శ్యాంసుందర్ రెడ్డి, జడ్పీసీఈవో రమాదేవి, డీపీవో హరిప్రసాద్, డీఈ ప్రసన్నకుమార్, తహసీల్దార్ వినోద్ కుమార్, ఎంపీడీవో సింగారపు కుమార్, ఎంపీవో గౌస్, సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గం తీర్చిదిద్దుకుందాం

పెద్దవంగర : పాలకుర్తి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. అవుతాపురం, రాజమాన్ సింగ్‌తండా, కాన్వాయిగూడెంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా సీఎం రేవంత్ కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీపీవో హరిప్రసాద్, ఎంపీపీ ఈదురు రాజేశ్వరి, జడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి సుధీర్, తహసీల్దార్ మహేందర్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, పీఆర్‌డీఈ, ఏఈలు ప్రసన్నకుమార్, దయాకర్, యుగేందర్, సురేష్, తొర్రూరు పీఏసీఎస్ ఛైర్మన్ హరిప్రసాద్, వైస్‌ఎంపీపీ కల్పనరాజు యాదవ్, సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, మాజీ పీసీసీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.


మడిపల్లిలో మాట్లాడుతున్న యశస్విని రెడ్డి

టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

● అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టొప్పో


మాట్లాడుతున్న లెనిన్ వత్సవ్ టొప్పో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 27 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టొప్పో సూచించారు. మహబూబాబాద్‌లో శనివారం జిల్లా విద్యాశాఖాధికారి, సెక్టోరియల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ఆయన నిర్వహించారు. విద్యార్థులను మూడు గ్రూపులుగా విభజించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేటాయించి,పరీక్షకు హాజరైన ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా చూడాలన్నారు. పది ఫలితాల్లో 85 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు పూర్తి బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనన్నారు. డీఈవో రామారావు, సెక్టోరియల్ అధికారులు మందుల శ్రీరాములు, ఆజాద్ చంద్రశేఖర్, విజయకుమారి, సతీష్ పాల్గొన్నారు.

పుస్తకాలను అందుబాటులో ఉంచాలి

మహబూబాబాద్ టౌన్ : ప్రతీ గ్రంథాలయంలో ప్రజలకు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను అందుబాటులో ఉంచాలని జిల్లా అదనపుకలెక్టర్ లెనిన్‌వత్సవ్ టొప్పో సూచించారు. మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయంలో శనివారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేసిన నిధుల వివరాలు, 2024-25 బడ్జెట్ అంచనాలు ఆమోదం కోసం పంపేందుకు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో సీసీ కెమెరాలు, ఇన్‌వర్టర్‌ను ఏర్పాటు చేయాలని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమమంలో జిల్లా విద్యాశాఖాధికారి రామారావు, వయోజనవిద్య డీడీ జయశంకర్, డీపీఆర్వో శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, తూర్పాటి శ్రీలత, ఎం.విజయ్, రుద్రారపు వీరేందర్, జి.విజేందర్, రవి పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

● కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు అంజయ్య

మహబూబాబాద్ టౌన్, జనవరి 27 : వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్టభద్రులంతా తమ ఓటును నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య కోరారు. మహబూబాబాద్ డీసీసీ కార్యాలయంలో శనివారం పట్టభద్రుల ఓటుహక్కు నమోదు ఫారం-18ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ప్రతీ ఒక్కరు ఫారం-18 ద్వారా ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో పట్టభద్రుల ఓట్లు అధికంగా నమోదు చేసుకుని ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి శాసన మండలికి పంపాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్, నియోజకవర్గ ఎల్‌డీఎం బండి శ్రీనివాస్, శంతన్‌రామారాజు, రాంశెట్టి వీరేందర్, బానోత్ ప్రసాద్‌నాయక్, గునిగంటి కమాలకర్, జూలకంటి సీతారాంరెడ్డి, అంబాల శివకుమార్, యాకయ్య ప్రవీణ్, రాము పాల్గొన్నారు.


గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు ఫారాలను ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

'తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి'


విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందిస్తున్న గ్రామస్థులు, ఉపాధ్యాయులు

పెద్దవంగర, జనవరి 27 : విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని హెచ్ఎం కళాధర్ అన్నారు. శనివారం మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన ముత్తినేని లక్ష్మణ్ తన తల్లిదండ్రులు ముత్తినేని మోహన్-విజయ జ్ఞాపకార్థం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రూ.17 వేల సొంతఖర్చులతో పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి సమాజ అభ్యున్నతి కోసం పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు భిక్షపతి సత్తయ్య, కృష్ణమూర్తి, సోమన్న, వెంకటేశ్వర్లు, రవి, శ్రీకాంత్, సుధాకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు 324 మంది

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 27 : జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలకు 324 మంది విద్యార్థులు ఎంపికైనట్లు జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తడకమల్ల బ్రహ్మం, లింగంపల్లి దయానంద్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శనివారం మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీల్లో ఇంగ్లీష్ మీడియం నుంచి 690 మంది, తెలుగు మీడియం నుంచి 420 మంది విద్యార్థులు పాల్గొనగా, వారిలో ఉత్తమప్రతిభ కనబరిచిన వారిని తెలుగు, ఇంగ్లీష్ మీడియం నుంచి 324 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 3న నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో మండలస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

నేటి నుంచి కౌన్సిలింగ్ తరగతులు

తొర్రూరు, జనవరి 27 : తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న అంబేడ్కర్ స్టడీ సెంటర్‌లో బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులకు ఆదివారం నుంచి కౌన్సిలింగ్ తరగతులు ప్రారంభం అవుతాయని కళాశాల ప్రిన్సిపల్ బి. రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ స్టడీ సెంటర్‌లో అడ్మిషన్లు పొందిన మొదటి సంవత్సరం విద్యార్థులందరు ఆదివారం జరిగే కౌన్సిలింగ్ తరగతులకు హాజ రు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్: 99086 95130 నంబరులో సంప్రదించాలని తెలిపారు..

జర్నలిస్టులకు తనవంతు సహకారం అందిస్తా

● మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జనవరి 27 : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్న జర్నలిస్టులకు తనవంతు సహకారాన్ని అందిస్తానని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీడబ్ల్యూజేఏ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. గిరిజన యువత జర్నలిజంలో రాణించడం అభినందనీయమన్నారు. చిత్తనూరి శ్రీనివాస్, రవినాయక్, గాడిపెల్లి శ్రీహరి, శ్రీనివాస్‌నాయక్, గుండోజు శ్రీనివాసు, భూక్య మోహన్, తేజావత్ శ్రీను, ముఖేష్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కేసముద్రం, జనవరి 27 : కేసముద్రం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం క్లబ్ సభ్యుడు రాపాక కుమారస్వామి సహకారంతో ఆయన తండ్రి వీరస్వామి జ్ఞాపకార్థం 27వ రోజు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బెజ్జం ప్రేమ్‌కుమార్, చార్టర్ ప్రెసిడెంట్ కె.చంద్రశేఖర్, పాస్ట్ జడ్‌సీ యర్రం శ్రీరాములు, కరివేదుల కృష్ణారెడ్డి, తంగళ్లపల్లి భాస్కర్, శామకూరి నర్సయ్య, చింతా కరుణాకర్, రాపోలు శ్రీనివాస్ రుద్ర శ్రీకాంత్, ముదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మడిపెద్ది వెంకటేష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వీరునాయక్ పాల్గొన్నారు.

విద్యార్థుల స్నాక్స్ కోసం రూ.5 వేల అందజేత

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 27 : కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న ఎస్సెస్సీ విద్యార్థుల స్నాక్స్ కోసంరూ.5 వేలు అందజేసినట్లు హెచ్ఎం రమేష్ తెలిపారు. స్థానిక పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, యాజమాన్య కమిటీ సభ్యులు రూ.5వేలు సమకూర్చగా, వాటిని సర్పంచ్ వీరన్న, మాజీ ఎస్ఎంసీ ఛైర్మన్ చిరంజీవి అందజేసినట్లు హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 69 మంది ఉన్నారని, వారికి ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వార్షిక పరీక్షలకు సంసిద్ధులను చేస్తున్నామని తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

● ప్రేమ విఫలమవడంతో మనస్తాపం
● పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లి
● వరంగల్‌లో విషాదం


ముంజ అఖిల (ఫైల్)

వరంగల్ సిటీ, జనవరి 27 : ప్రేమ విఫలమై ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదు వుతున్న విద్యార్థిని ముంజ అఖిల (19) ఆత్మహత్య చేసుకున్న ఘటన ఖిలావరంగల్ మండలంలోని పెరుకవాడలో శనివారం చోటుచేసుకుంది. మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలి తల్లి ముంజ కోమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముంజ కోటి, కోమల దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కోటి గతంలోనే మృతి చెందగా తల్లి కోమల కూలి పనిచేసుకుంటూ పిల్లల్ని చదివిస్తోంది. అఖిలనగరంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొంతకాలంగా అఖిల ఓ యువకుడిని ప్రేమిస్తోంది. వీరిప్రేమ విఫలమవడంతో దీంతో మనస్తాపం చెందిన అఖిల శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి కోమల ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు.

'గుంటూరు కారం'లో పాటను తొలగించాలి

బయ్యారం, జనవరి 27 : ఇటీవల సంక్రాంతి పండుగరోజు విడుదలైన గుంటూరు కారం సినిమాలోని 'కుర్చీ మడత పెట్టి..' అనే బూతు పాటను తొలగించాలని పీవైఎల్ బయ్యారం మండల అధ్యక్ష కార్యదర్శులు రమేష్, సురేష్ డిమాండ్ చేశారు. బయ్యారంలో శనివారం వారు మాట్లాడుతూ గుంటూరు కారం సినిమాలోని విలన్స్‌కు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడం కూడా సరైందని కాదన్నారు. పీడిత ప్రజల విముక్తికి మార్గం చూపిన మహనీయుల పేర్లను దర్శకనిర్మాతలు సినిమాలో ఎలాపడితే అలా వాడటం సభ్య సమాజంలో మంచి పద్ధతి కాదన్నారు. ప్రజాస్వామ్యంలో సినిమాలు ప్రజలకు ఆదర్శప్రాయంగా ఉండాలి తప్ప, కేవలం టీఆర్పీ రేటింగ్‌ల కోసమే సినిమాలు తీయొద్దని సూచించారు. వీరచందర్, రాజు, వెంకటేశ్, హరిసింగ్, మధు, సుమన్ పాల్గొన్నారు.

'ప్రజా పోరాటాలకు అండగా నిలవాలి'

డోర్నకల్,జనవరి 27 : పేదల కోసం పోరాడే కమ్యూనిస్టులకు ప్రజలు అండగా నిలబడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి కోరారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో సీపీఐ మండల కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అందజేసే ఫలాలలను వారికి అందించే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బీజేపీ పార్టీ దేశంలో నిరుద్యోగం, ఇతర సమస్యలు ఎన్నో ఉన్న మత రాజకీయాలు చేస్తూ ప్రజలలో విభజన భావాలు నాటుతుందన్నారు. సమాజంలో ధనిక, పేద ప్రజల మధ్య అంతరాలు పెరుగుతున్నాయని, ధనికులవద్దనే అధికారం కేంద్రీకృతమయిందన్నారు. మండల అధ్యక్షులు తురక రమేష్, నాయకులు ప్రబేష్, నెల్లూరు నాగేశ్వర్‌రావు, జెన్నె స్వామి, పొలెపాక వెంకన్నలు పాల్గొన్నారు.

'పోటీపడితేనే ప్రతిభ వెలుగు చూస్తుంది..'

గంగారం, జనవరి27 : చిన్నారులు ప్రతీ పరీక్షలలో పోటీ పడితేనే వారిలో నున్న ప్రతిభ వెలుగు చూస్తుందని జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు వాసం వీరస్వామి అన్నారు. ఈ మేరకు గంగారంలో శనివారం గిరిజన బాలికల ఆశ్రమపాఠశాలలో చెకుముకి పోటీలు నిర్వహించిన అనంతరం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. అనంతరం గెలుపొందిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఈసం నాగేశ్వరావు, రమేష్, నర్సయ్య, లక్ష్మీ, అనసూర్య, రమాదేవి, విజయ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన పెంచుకోవాలి

గార్ల జనవరి 27 : సమాజంలో విద్యార్థులు పాఠశాలస్థాయి నుంచే సమాజం అవగాహన పెంచుకొని, తమలో దాగిఉన్న మేధాశక్తిని బయటకు తీయాలని జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు సుందరయ్య అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 15 జిల్లా పరిసత్ పాఠశాల్లోని 45 మంది విద్యార్థులకు సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులపై చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. చింత నిప్పు రమే ష్, సురేందర్‌రెడ్డి, శీలంశెట్టి వెంకటేశ్వర్లు, మంగయ్య శివ, వీరభద్రం, రజిత, రంగారావు, ఎడ్ల అప్పయ్య పాల్గొన్నారు.

ప్రధానమంత్రి పరీక్ష పే కార్యక్రమానికి ఏకలవ్య విద్యార్థులు

కురవి, జనవరి 27 : కురవి ఏకలవ్య గురుకులానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఢిల్లీలో జరిగే ప్రధానమంత్రి పరీక్ష పే కార్యక్రమానికి ఎంపికయ్యారని ప్రిన్సిపల్ సంతోష్ తెలిపారు. 9వ తరగతి చదువుతున్న అక్షయ, ఇంటర్ బైపీసీ చదువుతున్న మహేశ్వరి, గోవర్ధనీలు ఈ కార్యక్రమానికి ఎంపికయ్యారు. తెలంగాణలోని 23 ఏకలవ్య రెసిడెన్షియల్ మోడల్ స్కూళ్ల నుంచి మొత్తం 10 మంది విద్యార్థినులు ఎంపిక కాగా, ఒక్క కురవి గురుకులం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం విశేషం. విద్యార్థినులను గురుకులాల సెక్రటరీ నవీన్‌నికోలస్, డిప్యూటీ సెక్రటరీ చంద్రశేఖర్ అభినందించారు.

బీజేపీ గిరిజన మోర్చా మండల అధ్యక్షుడిగా కిషన్‌నాయక్

కురవి, జనవరి 27 : బీజేపీ గిరిజన మోర్చా కురవి మండల అధ్యక్షులుగా లింగ్యాతండా (బీ)కు చెందిన భూక్య కిషన్‌నాయక్‌ను నియమించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు బుడిగే భద్రసేన గౌడ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన నియామకపత్రం అందించారు. ఈసందర్భంగా కిషన్‌నాయక్ మాట్లాడుతూ.. గిరిజన సమస్యలపై నిరంతరం పోరాడుతనన్నారు. తన ఎంపికకు కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు, హుస్సేన్‌నాయక్, జాటోతు పవన్, చీకటి మహేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● జిల్లా కోర్టు సీనియర్ న్యాయమూర్తి సురేష్


న్యాయ చైతన్య సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కోర్టు సీనియర్ న్యాయమూర్తి సురేష్

సీరోలు, జనవరి 27 : పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని మహబూబాబాద్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ న్యాయమూర్తి సి.సురేష్ అన్నారు. సీరోలు మండలకేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో శనివారం న్యాయ చైతన్య సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సురేష్ మాట్లాడుతూ పోక్సో, 354, 376, సెక్షన్‌లపై అవగాహన కల్పించారు.విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి పి.మౌనిక, గవర్నమెంట్ ప్లీడర్ వెంకటయ్య ప్రిన్సిపల్ చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎస్సై విజయ్‌రాంకుమార్, పాల్గొన్నారు.

హైస్కూల్‌కు క్రీడా సామగ్రి అందజేత

కేసముద్రం, జనవరి 27 : వరంగల్ సత్యసాయి సేవా ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో కేసముద్రం స్టేషన్ జడ్పీహైస్కూల్‌కు రూ.13 వేల విలువైన క్రీడాసామగ్రి, రూ.3వేల విలువైన పుస్తకాలను శనివారం అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ భట్టు శ్రీను మాట్లాడుతూ బలహీనవర్గాల విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి.రాజు, ట్రస్ట్ సభ్యులు బ్రహ్మదేవర లలిత, భూసాని మధులిక, పల్లెర్ల చైతన్య, కూరగాయల శ్రీలక్ష్మి, మంచికట్ల ప్రసూన, నేలపల్లి మాధవి పాల్గొన్నారు. ఇదే పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించగా డీఈవోగా బానోత్ వసంత్, హెచ్ఎంగా ఎస్‌కె.తస్లీమా వ్యవహరించారు.

విద్యార్థులకు నిఘంటువుల పంపిణీ

నెల్లికుదురు, జనవరి 27 : నర్సింహులగూడెం పాఠశాలలో వనసంరక్షణ సేవాసమితి సంస్థ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ నిఘంటువులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు హరినాథ్‌బాబు మాట్లాడుతూ విశ్రాంత ఉపాధ్యాయుడు బండారి ఉప్పలయ్య రూ.14 వేలతో విద్యార్థులకు పుస్తకాలు అందజేయడం అభినందించదగ్గ విషయం అన్నారు. సర్పంచ్ ఉప్పలయ్య, ఎంపీటీసీ వేశాల కృష్ణయ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొడుకులు కాదన్నారు..

తానే కొడుకై తల్లికి తలకొరివి పెట్టిన కుమార్తె


య్యారంలో తల్లికి తలకొరవి పెడుతున్న కూతురు పద్మ


వెంకటమ్మ (ఫైల్)

బయ్యారం, జనవరి 27 : జిల్లాలోని బయ్యారానికి చెందిన అడిదెల వెంకటమ్మ (85) శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, శనివారం స్వగ్రామమైన బయ్యారానికి వెంకటమ్మ మృతదేహాన్ని తీసుకురాగా, ఆమె కుమారులిద్దరూ తలకొరివి పెట్టడానికి ముందుకు రాలేదు. దీంతో ఆమె కన్న కూతురు పద్మ తలకొరివి పెట్టి, తల్లి రుణం తీర్చుకుంది. వివరాల్లో కెళ్తే..

బయ్యారం గ్రామానికి చెందిన అడిదెల రామిరెడ్డి-వెంకటమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. ఇరువురు కుమారులు పర్విరెడ్డి, శ్రీనివాస్ రెడ్డితో పాటు కూతురు పద్మ ఉన్నారు. 30 ఏళ్ల కిందటే అనారోగ్యంతో అడిదెల రామిరెడ్డి మృతి చెందాడు. ఆ తర్వాత సదరు కుటుంబలో ఆర్థికపరమైన వివాదాలు తలెత్తాయి. ఆస్తుల పంపకాల్లో చిన్నకుమారుడు శ్రీనివాస్‌రెడ్డితో వెంకటమ్మకు గొడవలు ఆరంభమయ్యాయి. ఆమె స్థానిక కాకతీయ నగర్‌లోని తనఇంట్లో కొంతకాలం ఒంటరిగానే జీవనం కొనసాగించింది. తర్వాత వయో భారంతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో గత 8 ఏళ్లుగా వెంకటమ్మ నర్సంపేట మండలం మేడేపల్లిలోని తన కూతురు సంకపల్లి పద్మ వద్దనే ఉంటోంది. వారం రోజుల క్రితం బిడ్డ ఇంట్లోనే జారిపడడంతో కాలువిరిగిన ఆమెను చికిత్స నిమిత్తం హైదరబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వెంకటమ్మకు ఇతర ఆరోగ్య సమస్యలు తోడు కావడంతో శుక్రవారం వెంకటమ్మ మృతి చెందింది. శనివారం బయ్యారంలో నిర్వహించాల్సిన అంత్యక్రియల్లో స్వయాన ఆమె కుమారులు ఇద్దరు తలకొరివి పెట్టడానికి ముందుకు రాలేదు. కుటుంబసభ్యులు, కుల పెద్దలు జోక్యం చేసుకున్న ససేమిరా అంటూ నిరాకరించారు. దీంతో ఆమె కుమార్తె పద్మ శనివారం ముందు నడిచి తలకొరివి పెట్టింది. కాగా, చివరిదశలో దహన సంస్కారాలకు హాజరైన పెద్దకొడుకు పర్విరెడ్డి తల్లి వెంకటమ్మ అంతిమయాత్రలో పాల్గొని స్మశాన వాటిక వరకు వచ్చి, వెనుతిరిగి వెళ్లిపోయాడు. కాగా, తల్లి చనిపోతే కొడుకులు తలకొరివి పెట్టకపోవడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నెల్లికుదురు. జనవరి27 : గొడ్డలి కర్రతో దాడి చేసిన వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. ఎర్రబెల్లిగూడెంకి చెందిన మచ్చ పుల్లయ్య, అదే గ్రామానికి చెందిన బండారు కృష్ణ మధ్య ఈ నెల 25న సెల్‌ఫోన్ గురించి వివాదం జరింగింది. అనంతరం అదేరోజు మచ్చ పుల్లయ్య బస్‌స్టాండ్ వద్ద ఆటోలో నిద్రిస్తున్న సమయంలో బండారు కృష్ణ గొడ్డలి కర్రతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలైనాయి. వెంటనే గ్రామస్థులు మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. శనివారం మచ్చ పుల్లయ్య కుమారుడు మచ్చ రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు నిందితుడు బండారు కృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ పేర్కొన్నాడు

యువతి అదృశ్యం

మహబూబాబాద్ రూరల్, జనవరి27 : జిల్లా కేంద్రం సుందరయ్యనగర్ కాలనీకి చెందిన గరిపెల్లి లిఖిత అనే యువతి అదృశ్యమైనట్లు టౌన్ ఎస్సై శివ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. కాలనీకి చెందిన లిఖిత శుక్రవారం సాయంత్రం ఎన్టీఆర్ స్టేడియంలో వాకింగ్ చేసి వస్తానని వెళ్లింది. ఆమె రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లలో వాకబు చేశారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి వేణు మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా సువర్చలా హనుమత్ కల్యాణం


సువర్చలా హనుమత్ కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మహబూబాబాద్ఎడ్యుకేషన్, జనవరి 27 : జిల్లా కేంద్రంలోని పీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో సువర్చలా హనుమత్ కల్యాణం ఘనంగా జరిపించారు. ఎన్టీఆర్ స్టేడియం సమీపంలోని పీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రెండోరోజు శనివారం సువర్చలా హనుమత్ ఉత్సవ విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణం జరిపించారు. ఈ వేడుకలో సత్యసాయి సేవాసమితి బాధ్యులు సామల శ్రీనివాస్, బొడ్ల రామకృష్ణ, చౌడవరపు విద్యాసాగర్, భువనగిరి రవీంద్రగుప్తా, , పులిమాటి రాజగోపాల్, ప్రదీప్, అనిల్‌కుమార్, యాదగిరి, వందనం కమల్ కుమార్, ప్రకాష్, ఇమ్మడి చంద్రప్రకాష్, భవిరిశెట్టి నారాయణరావు, చీదర ఉపేందర్, వెంపటి జగదీశ్వర్, కొండ్లె శ్రీనివాస్, నర్మదా, సాయిలత, కవిత, స్వరాజ్యం, మాధవి, స్వర్ణ, శ్రీకళ, జ్యోతి పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్‌లో వినయ్‌కుమార్‌కు డాక్టరేట్



తార్నాక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలానికి చెందిన బొడ్డు వినయ్‌కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను పొందారు. ఓయూలోనిడిపార్ట్‌మెంట్ ఎడ్యుకేషన్ విభాగంలో ప్రొఫెసర్ రవీంద్రనాథ్ కె.మూర్తి పర్యవేక్షణలో 'సెర్టెన్ ఫ్యాక్టర్స్ రిలేటెడ్ టు స్టూడెంట్‌ఎంగేజ్‌మెంట్ ఏస్టడీ అమాంగ్ సీనియర్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను డాక్టరేట్ పట్టాను అందుకోవడం జరిగిందని శనివారం ఆయన తెలిపారు. తనకు డాక్టరేట్ పట్టా రావడానికి సహకరించిన ప్రొఫెసర్లకు, పరిశోధనా విద్యార్థులకు వినయ్‌కుమార్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ప్రొటోకాల్ పాటించని బీఆర్ఎస్ నేతలు

● బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హుమ్యానాయక్


మాట్లాడుతున్న హుమ్యానాయక్

తొర్రూరు, జనవరి 27 : జాతీయజెండా పేరుతో లక్షల రూపాయల చందాలను వసూలు చేసి మూటకట్టుకున్న బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ పార్టీని విమర్శించే అర్హతలేదని తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హుమ్యానాయక్ అన్నారు. శనివారం తొర్రూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎర్రబెల్లి దయాకర్ రావు మంత్రిగా ఉన్న సమయంలో కొందరు బీఆర్ఎస్ నాయకులు వ్యాపారులు, ఇతరుల వద్ద లక్షల రూపాయలు చందాలు వసూలు చేసి, వంద అడుగుల జెండాను ఏర్పాటు చేసి ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు పెదగాని సోమయ్య, సదాకర్, మురళి, మహేందర్, సోమిరెడ్డి, వెంకన్న, సాగర్, మహేష్, కృష్ణ, మురళి తదితరులు ఉన్నారు.

గంగమ్మ ఆలయానికి హాకా ఛైర్మన్ విరాళం

మరిపెడ రూరల్, జనవరి 27 : మండలంలోని ఎల్లంపేట చెరువు వద్ద మత్స్యకారులు నిర్మిస్తున్న గంగమ్మ దేవాలయానికి హాకా ఛైర్మన్ మచ్చా శ్రీనివాసరావు రూ.లక్ష నూట పదహార్లు విరాళంగా శనివారం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడారు. ముదిరాజ్ నిర్మాణం చేస్తున్న దేవాలయం చాలా చక్కగా ఉందన్నారు. అనంతరం హాకా ఛైర్మన్‌ను సర్పంచ్ తాళ్లపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ తాళ్లపల్లి రఘు సన్మానించారు. రామాలయ గుడి ఛైర్మన్ గండి వెంకటేశ్వర్లు, గండి మహేష్, రాగం రమేష్, గండి పరమేష్, దుండి వీరన్న, శ్రీనివాసు, ఆంజనేయులు, సైదులు, లింగన్న, రమేష్, ముత్తయ్య, బుస లింగన్న తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తొర్రూరు రూరల్, జనవరి 27 : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత అన్నారు. శనివారం అమ్మాపురం ఉన్న పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సరిత మాట్లాడుతూ విద్యార్థులు పోక్సో, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పైన అవగాహన కలిపించారు. ఈవ్‌టీజింగ్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో విద్య నభ్యసించి ఉన్నతమైన లక్ష్యాలను సాధించాలన్నారు. సీఐ సత్యనారాయణ, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం వీరన్న, లాయర్ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురువుకు తక్కెళ్లపల్లి ఆత్మీయ సన్మానం

చిన్నగూడూరు, జనవరి 27 : బాల్యంలో అక్షరాలు దిద్దించి విజ్ఞానాన్ని పంచిన గురువు పానుగంటి జగన్నాథ్‌రెడ్డిని శనివారం మండలంలోని జయ్యారంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయ పాదాభివందనం చేసి, శాలువాతో సత్కరించారు. తన గురువుతో ఆనాటి మధురస్మృతులను కాసేపునెమరు వేసుకున్నారు. అనంతరం జయ్యారం ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. పాఠశాలలో మురుగుదొడ్ల నిర్మాణానికి రూ.5లక్షలు, గ్రామ బతుకమ్మ ఘాట్‌కు రూ. 5లక్షల చొప్పున ఎమ్మెల్సీ నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. తదుపరి గ్రామంలోని ధ్యాన మందిరం డైరెక్టర్ పూసపాటి వెంకన్నను సన్మానించారు. జెర్రిపోతుల వెంకన్న, బానోత్ రవి కుమార్, వల్లూరి క్రిష్ణారెడ్డి, ఎడ్ల మల్లన్న, వెంకన్న, రామకృష్ణ ఉన్నారు.

రేపోణిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

దంతాలపల్లి, జనవరి 27 : మండలంలోని రేపోణి గ్రామంలో శనివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణను అంబేద్కర్ రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు ధర్మారపు పవన్ కుమార్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మేధాశక్తితో అంబేద్కర్ పేదల కోసం, అన్నిజాతుల కోసం కృషి చేశారన్నారు. సర్పంచ్ నాగిరెడ్డి శైలజారెడ్డి, వైస్ ఎంపీపీ కొంపెల్లి పద్మ, ఎంఆర్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేష్, సీనియర్ నాయకుడు మిడ్తపల్లివెంకన్న, రేపోణి అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు తప్పెట్ల శంకర్ పాల్గొన్నారు.

'లక్ష్యాన్ని ఎంచుకుని చదువుకోవాలి'

తొర్రూరు, జనవరి 27 : విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని చదువు కోవాలని చిన్నప్పటి నుంచి శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తహసీల్దార్ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం తొర్రూరులోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో నిర్వహించిన జనవిజ్ఞాన వేదిక మండలస్థాయి చెకుముకి పోటీలను విద్యాశాఖ మండలనోడల్ అధికారి బుచ్చయ్యతో కలిసి ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు అందించారు. కరస్పాండెంట్ హనుమాండ్ల దేవేందర్‌రెడ్డి, యాకయ్య, సంపత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రమేష్, వసుందర్, వెంకన్న, జనార్దన్, ప్రేమలత పాల్గొన్నారు.